క్లుప్తంగా

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి చిత్రపటానికి పూజ చేస్తున్న సత్యనారాయణ

మండపేట: మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరీ జయంతిని శనివారం మండపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉషా క్లినిక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ధన్వంతరి చిత్ర పటానికి అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమహావిష్ణువు ధన్వంతరిగా అవతారమెత్తి సమస్త ప్రాణకోటికి వైద్యాన్ని అందించే వారన్నారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, సంఘ నాయకులు బల్ల వెంకటరమణ, వానపల్లి కనకరాజు, మండిపూడి చంద్రశేఖర్, మానేపల్లి శ్రీనివాస్, పిల్లా సతీష్, నరేష్, మణికంఠ, చిన్నారావు, వీరబాబు, సురేష్, పాల్గొన్నారు.

చిక్కాలకు ఎమ్మెల్సీ తోట పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఇటీవల ఒక ప్రమాదంలో చేతికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావును శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ద్వారపూడిలోని ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ తులా శేషారావు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు ఆయన వెంట ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.15 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ నాగబాబు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి తణుకు పాలంకి వాస్తవ్యుడు కాలే సాయిశ్రీ భావన శనివారం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతను శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

దీపం..కళాత్మక రూపం

- వలు డిజైన్లలో దీపావళి ప్రమిదలు
- దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

రాయవరం/కాజులూరు: దీపావళి అంటే వెలుగుల పండగ. సంతోషం ఇళ్లలో దీపాల వరుసలై కళకళలాడుతుంది. ఈ పండగలో దీపమే ప్రధాన పాత్ర వహిస్తుంది. ఇందుకు సాధారణ దీపాలతో పాటు, కొత్త రకం దీపాలను కూడా వెలిగించేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి వారి కోసం జిల్లాలోని పలు మార్కెట్లలో సాధారణ రకంతో పాటు పలు డిజైన్లలో టెర్రకోట ప్రమిదలను విక్రయిస్తున్నారు. దీపావళి అనగానే మట్టి దీపాల వరుసలు గుర్తుకు వస్తాయి. నిన్నమొన్నటి వరకూ ప్రజలందరూ పండగ సందర్భంగా వెలిగించుకునే దీపాల కోసం మట్టి ప్రమిదలనే వాడేవారు. ఇటీవల రాజస్థాన్ నుంచి టెర్రకోట పద్ధతిలో తయారు చేసిన ఆకర్షణీయమైన ప్రమిదలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. దాంతో ప్రజలందరూ వాటివైపే మొగ్గు చూపుతున్నారు. సాధారణ డిజైన్ గల మట్టి ప్రమిదల స్థానంలో నెమళ్లు, ఏనుగులు, తాబేళ్లు, పూలు, దేవతా రూపాలు ఇలా అందరినీ ఆకర్షించే డిజైన్లలో ప్రమిదలు లభిస్తున్నాయి. దీంతో ఇటీవల ఇంటి ప్రమిదల జోరు పెరిగింది. ఏటా ఈ పండగ కోసం ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రోడ్ల కూడళ్లలో ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం రాజస్థాన్ దీపాలకు మంచి గిరాకీ ఏర్పడింది. రకరకాల కళ్లు చెదిరే డిజైన్లు ఉండడంతో



వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న ప్రమిదలు

ప్రజలు వాటి పట్ల ఆకర్షితులవుతున్నారు. తాము కోరిన కళాత్మక రూపాల్లో దీపాలను వెలిగించుకోవాలని పలువురు ముచ్చట పడుతున్నారు. మట్టి దీపాలకు ఆదరణ తగ్గడంతో స్థానికంగా తయారు చేసే వారు కొందరు ఆయా ప్రాంతాలకు వెళ్లి రాజస్థాన్ దీపాలను తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఒకదాన్ని మించి మరొకటి అత్యంత కళాత్మకంగా ఉండడంతో వీటిలో దీపం వెలిగిస్తే తమ ఇంటికి శోభ వస్తుందన్న నమ్మకంతో వీటిని కొనేందుకే ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మట్టి దీపాలతో పాటు చిట్టి దీపాలు దాదాపు పలు డిజైన్లలో లభిస్తున్నాయి. డజన్ రూ.15 నుంచి రూ.60 ధరలో అందుబాటులో ఉన్నాయి.



కాజులూరులో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు

ప్రమిదల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

జోరుగా కొనుగోళ్లు

ఇప్పటికే ప్రమిదల విక్రయాలు జోరందుకున్నాయి. మహిళలు ఉదయం 11 గంటల తర్వాత, సాయంత్రం మూడు గంటల తర్వాత, ఇతర కుటుంబాలు, బంధుమిత్రులతో కలిసి వందలాది డిజైన్ల నుంచి తమకు నచ్చిన ప్రమిదలను ఎంపిక చేసుకుని డజన్ల వంతున కొనుగోలు చేస్తున్నారు. ప్రమిదల్లో నూనె ఎక్కువగా పీల్చని టెర్రకోట రకాలనే ఎంపిక చేసుకుంటున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్తిక మాసంలో నాలుగు వారాలు పూర్తిగా దీపాలు వెలిగించాల్సి ఉంటుంది. కాబట్టి మహిళలు ముందు జాగ్రత్తతో తమ కుటుంబాలకు సరిపడా మట్టి ప్రమిదలను కూడా కొనుగోలు చేస్తున్నారు. వీటిలో నూనె అయిపోయినప్పటికీ, ఇంకిన నూనెను ఒత్తి తీసుకుని మరికొంత సేపు వెలుగునిస్తుంది. అందువల్ల పాత తరం మహిళలు మట్టి ప్రమిదలనే కొంటున్నారు. వీటి ధర తక్కువగా ఉండడం, స్థానికంగా తయారవడంతో వీటికి సైతం మంచి డిమాండ్ ఉంది. పైగా దీపావళి ముగిసిన వెంటనే కార్తిక మాస దీపోత్సవాల్లో పాల్గొని దీపాలు పెట్టేందుకు, వన భోనాలకు వెళ్లి దీపాలు పెట్టేందుకు, సామూహిక దీపారాధన చేసేందుకు ఎక్కువ ప్రమిదలు అవసరం అవుతున్నాయి.

ఇవీ నిబంధనలు

- బాణసంచా దుకాణాల ఏర్పాటులో ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నిబంధనలను అధికారులు ఈ విధంగా సూచిస్తున్నారు.
- దుకాణానికి దుకాణానికి మధ్య తప్పనిసరిగా మూడు మీటర్ల దూరం ఉండాలి.
- ప్రతి దుకాణం ముందు పెద్ద డ్రమ్ముల్లో 500 లీటర్ల నీరు, మూడు బకెట్ల ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలి.
- మంటలను అదుపుచేసే డీసీపీ కెమికల్ పౌడర్ ఒక సిలిండర్ ఉండాలి.
- దుకాణాల సమీపాన బాణసంచా కాల్చరాదు. నూనె, గ్యాస్ దీపాలు దగ్గర్లో ఉంచరాదు.
- అలాగే దుకాణాల వద్ద పెద్ద ఎత్తున బాణసంచా నిల్వలు ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిమితి ప్రకారం బాణసంచా తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక వాహనం రావడానికి వీలుగా ఏర్పాటు చేసుకోవాలి.
- 18 ఏళ్ల వయసులోపు పిల్లలతో అమ్మకాలు చేయించకూడదు.

నిబంధనల మేరకే అనుమతులు



బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనల మేరకే అనుమతులిచ్చాం. దుకాణాల ఏర్పాటు, అమ్మకాల్లో నిబంధనలు పాటించకుంటే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకొంటామని వ్యాపారులకు హెచ్చరించే అనుమతులు ఇస్తున్నాం. దుకాణాల వద్ద నిబంధన ప్రకారం ఇసుక, నీరు, దుకాణాల మధ్య ఖాళీ తప్పనిసరిగా ఉండాలి.

– మైలా వెంకటేశ్వరరావు, తహసీల్దార్, రామచంద్రపురం

జనావాసాలకు దూరంగా ఉండాలి



బాణసంచా విక్రయదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. దుకాణాలు జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవటంతో పాటు ప్రమాదాల నివారణకు తగిన రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి. లైసెన్సులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

దీపావళి బాణసంచా కొనుగోళ్ల సందడి

రామచంద్రపురం రూరల్: దీపావళి పండగను పురస్కరించుకుని ద్రాక్షారామ సున్న వారి కాంప్లెక్స్ వెనుక ఏర్పాటు చేసిన బాణసంచా స్టాల్స్ వద్ద, హసన్‌బాదలోను, వెల్లలోను కొనుగోళ్ల సందడి నెలకొంది. శనివారం పెద్దలు, చిన్నారులు తమకు కావాల్సిన చిచ్చుబుడ్లు, మతాబులు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు, కాకర పువ్వొత్తులు తదితర మందుగుండు సామగ్రిని ఉత్సాహంగా కొనుగోళ్లు జరిపారు.

చెకుముకి వైజ్ఞానిక పరీక్షకు 660 మంది విద్యార్థులు

కపిలేశ్వరపురం: మండలంలోని ఎనిమిది ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత, ఒక యూపీ పాఠశాల, ఒక ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన జన విజ్ఞాన వేదిక చెకుముకి వైజ్ఞానిక పరీక్షకు 660 మంది విద్యార్థులు హాజరైనట్టు వేదిక ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శ్రీనివాస్ శనివారం తెలిపారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 85 మంది, నల్లూరు నుంచి 75, కపిలేశ్వరపురం 30, టేకి 61, కాలేరు 52, అంగర 130, వాకతిప్ప 40, మాచర 54, వెదురుమూడి యూపీ పాఠశాల నుంచి నలుగురు మొత్తం 531 మంది విద్యార్థులు పరీక్ష రాసారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి అంగర రామకృష్ణ పాఠశాల నుంచి 129 మంది హాజరైనట్టు శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, యానాం రహదారిలో బంధనపూడి ఊటచెరువు సెంటర్ వద్ద శనివారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన చంద్ర ధనరాజు తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. బంధనపూడి శివారు ఊటచెరువు సెంటర్ వద్దకు వచ్చేసరికి స్కూటరు అదుపుతప్పి రోడుపక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో ధనరాజు గాయాల పాలవగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

ద్రాక్షారామలో జల ప్రసాదం కేంద్రాల ఏర్పాటు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జల ప్రసాద ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన జల ప్రసాద కేంద్రం

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రఖ్యాత ఫార్మా కంపెనీ దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన జల ప్రసాదం కేంద్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా గుర్తించి దివీస్ సంస్థ ప్రముఖ దేవాలయాల్లో జలప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు ఆర్.సుధాకర్, సీహెచ్ శ్రీనివాసులు, తేజ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో రూ.72 లక్షలతో 4 జల ప్రసాదం కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆలయ ముఖద్వారం పక్కన, కోటిపల్లి రోడ్డులో ఆలయ వసతి గృహాల వద్ద ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను మంత్రి ప్రారంభించడం సంతోషకరమన్నారు. 4 కేంద్రాలను ఏర్పాటు చేసిన తరువాత ఆలయానికి వచ్చే భక్తులు ప్రతిరోజూ సుమారు 80 వేల మందికి శుద్ధి చేసిన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, కాలుకురచ ఏడుకొండలు, దడాల రవికుమార్, చల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మిమ్మల్ని గెలిపించిన మేం అరాచక శక్తులమా?

ఎమ్మెల్యే వేగుళ్లపై కేశవరం ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఆగ్రహం

మండపేట: మూడు పర్యాయాలు మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించిన తాము మీ కంటికి అరాచక శక్తులుగా కనిపిస్తున్నామా? అంటూ కేశవరం కుర్రా వారి మెట్ట ఇళ్ల స్థల లబ్ధిదారులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దేవతల్లా కనిపించిన తాము సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ముందుకు వస్తే దెయ్యాల్లా కనిపిస్తున్నామా అని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన ఇళ్ల స్థల లబ్ధిదారులు, స్థానికులు సీహెచ్ దుర్గ, బోడపాటి మంగ, అంతర్వేది చంద్ర, దేవర అరుణ తదితరులు మీడియాతో మాట్లాడారు. కేశవరంలో అరాచకశక్తులు ఉండడం వల్లే తాను కుర్రా వారి మెట్ట వద్దకు వెళ్లేందుకు పోలీస్ రక్షణ కోరినట్టు ఎమ్మెల్యే చెబుతున్నారని వారు ఆరోపించారు. ఎన్నికల ముందు ఎందుకు పనికిరాని పట్టాలు ఇచ్చి మీరు చేతులు దులుపుకుంటే మా వెతలు చూసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సొంతింటి కలను సాకారం చేసేందుకు నడుం కట్టారన్నారు. స్థలం లెవెలింగ్ పనులు చేస్తుంటే అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఎవరికైనా సెంటు భూమి ఇచ్చారాని ప్రశ్నించారు. తమ గ్రామం నుంచి గ్రావెల్ సంపదను కొల్లగొట్టడమే తప్ప గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వేగుళ్ల చేసిందేమీ వారు విమర్శించారు. రెండు రోజుల క్రితం స్థలం లెవెలింగ్ పనులు నిలుపుదల చేయించేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల వస్తున్నారని తెలిసి నిరసన తెలిపేందుకు తాము కోడిగుడ్లు, టమాటాలతో కుర్రా వారి మెట్టకు వచ్చామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శుక్రవారం కేశవరం మెట్ట వద్దకు వచ్చి పనులు పరిశీలించి వెళ్లారని, ఆయన్ని ఎవరైనా అడ్డుకున్నారా అని ప్రశ్నించారు. తమ సొంతింటి కల సాకారం కాకుండా అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని వారు స్పష్టం చేశారు. లబ్ధిదారులు వీసు నాగమణి, పిల్లి అచ్చియమ్మ, చుక్కా వరలక్ష్మి, సత్యవతి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి

- మంత్రి వేణు గోపాలకృష్ణ
- పట్టణంలో గుడ్ మార్నింగ్



పట్టణంలోని బాణసంచా దుకాణాల వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకొనే దీపావళి పండగ ప్రతి ఇంట శుభాలు జరగాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దీపావళి పండుగ సందర్భంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో శనివారం ఉదయం మంత్రి వేణుగోపాలకృష్ణ గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద మార్కెట్ వద్ద ప్రత్యేక ప్రాంతంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను ఆయన సందర్శించారు. బాణసంచా దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే దీపావళి పండగను టపాసులు పేల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పెద్దలు తమ పిల్లలతో జాగ్రత్తలు పాటించే విధంగా ఉండాలని, బాణసంచా కాల్చే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో బాణసంచా అమ్మకాలు జరిగే చోట్ల ప్రభుత్వపరంగా, చట్టపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని, దీనిపై మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. దీపావళి పండగ అందరి ఇంట కాంతివంతంగా జరగాలని ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని అందరికీ శుభాలు జరగాలని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

జోగేశ్వరరావు చర్యలు హాస్యాస్పదం

సాగు సలహా మండలి చైర్మన్ కృష్ణమూర్తి తదితరుల ధ్వజం



నల్లూరులో మాట్లాడుతున్న కృష్ణబాబు, తదితరులు

కపిలేశ్వరపురం: నియోజకవర్గ ప్రజలకు దూరమైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తమ నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై తప్పుడు ఆరోపణలకు పరిమితమై రాజకీయం చేస్తున్నారని మండల వ్యవసాయ సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు ఆరోపించారు. నల్లూరులో శనివారం విలేకరులతో కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, నాయకులు కురుపూడి భువనేశ్వరి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కె.శివకుమార్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఘనత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చెందుతుందన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే వేగుళ్ల ప్రజలను గాలికి వదిలేశారన్నారు. దీంతో ఆయన ప్రజలకు దూరమయ్యారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కేశవరంలో పేదలకు ఇళ్ళు కట్టిస్తున్నారన్న ప్రజా ప్రయోజన ప్రయత్నాలను తప్పుదారి పట్టించడం ద్వారా ఎమ్మెల్యే వేగుళ్ళ, జనసేన నేత లీలాకృష్ణలు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట ప్రజలకు దగ్గరైన తీరు, పేదలకు చేస్తున్న మేలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పాలనా తీరును ఓర్వలేక జోగేశ్వరరావు, లీలాకృష్ణలు హుందాతనాన్ని కోల్పోయి వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయాల్లో గెలుపుకోసం మరింత ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేయాలని హితవు పలికారు. ప్రజలకు ఏమి మేలు చేస్తారో చెప్పకుండా ప్రజల్లో వెలుగొందుతున్న ఎమ్మెల్సీ తోటను విమర్శించడమే లక్ష్యంగా జోగేశ్వరరావు, లీలాకృష్ణ రాజకీయాలు చేస్తున్నారన్నారు. వారి రాజకీయ ప్రయత్నాలే వారి పతనానికి దారితీస్తున్నాయని వారిద్దరూ గుర్తించాలన్నారు. ఇళ్ళు కట్టే ప్రయత్నాలను ముమ్మరం చేయడం ద్వారా ఎమ్మెల్సీ తోటకు కేశవరం ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వారంతా ఎమ్మెల్యే జోగేశ్వరరావు, జనసేన నేత లీలాకృష్ణల దిష్టి బొమ్మలను కోడిగుడ్లతో కొట్టడాన్ని టీడీపీ, జనసేన నేతలు గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో సిద్ధాని సూరిబాబు, కందుకూరి దావీదు, కరుపూడి రాంబాబు, ఖండవిల్లి సుబ్రహ్మణ్యం, అతికెల శంభులింగం పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా..



చిన ద్వారపూడిలో మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చిన ద్వారపూడిలో గడప గడపకూ..

మండపేట: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన చినద్వారపూడిలో పర్యటించారు. పంచాయతీ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితురులతో కలిసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా ఈ గ్రామస్తులకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ రాజు, పంచాయతీ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అవినీతికి, అక్రమాలకు తావులేకుండా సీఎం జగన్ పారదర్శకంగా పాలన సాగిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో మాదిరి నాయకులు, అధికారులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పని లేకుండా వారే తమ వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని చెబుతున్నారన్నారు. మరలా మరలా జగన్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు పోతుల రాంబాబు, గారపాటి అశోక్‌కుమార్, సంగిశెట్టి రమేష్, యరగతపు విజయ్, సత్తి సత్తిబాబు, పాలినాటి సత్యనారాయణ, పోతుల దుర్గాప్రసాద్, తోరం శ్రీనివాస్, సత్తి రాంబాబు, నామాల శ్రీనివాస్, మేకా మణి, నామాల సుబ్రహ్మణ్యంనాయుడు, గూడూరి సుబ్బరాజు, గాదంశెట్టి రాంబాబు, పాల్గొన్నారు.

కూలీల కోసం పని చేయడం అభినందనీయం

రావులపాలెం: వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంఘ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. శనివారం రావులపాలెంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) ప్రథమ మహా సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సంఘ సభ్యులందరినీ పేరుపేరునా అభినందించారు.

ఈ సందర్భంగా సమావేశం నిర్వహించిన తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం భవనాన్ని 2004లో ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ గ్రాంట్ నుంచి నిర్మించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పితే అంతే సంగతులు

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ఆసుపత్రి పాలవ్వాల్సిందే. పర్యాటకంగా ఆహ్లాదకరంగా ఉండే జొన్నాడ-యానం ఏటిగట్టు రహదారికి బెర్మలు లేకపోవడం ముప్పుగా మారింది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రోడ్డు బాగుండడంతో జొన్నాడ-యానం రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో బెర్మలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకరంగా ఉంది. కోటిపల్లి-కోట, బ్రహ్మపురి-గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్మలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ఏటిగట్టు పరీవాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



బెర్మలు లేక కోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

• కనువిందు చేస్తున్న మంచుదుప్పటి..



ఉదయం 6 గంటలకు కనువిందు చేస్తున్న పొగ మంచు

శీతా కాలం ప్రారంభమైంది. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు గత నాలుగు రోజులుగా తగ్గుతున్నాయి. అయితే తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు గ్రామీణ ప్రాంతాల్లో మంచు దుప్పటిలా అల్లుకుంటుంది. మండల కేంద్రమైన కె.గంగవరంలో శనివారం ఉదయం మంచు 8 గంటల వరకు వదలలేదు. దీంతో పచ్చని పంట పొలాల మధ్య కొబ్బరిచెట్ల మీద ఉన్న మంచు కనువిందు చేసింది. ఉదయాన్నే పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు మంచును చేసి కనువిందు చేసే వాతావరణాన్ని ఆస్వాదించారు.

-కె.గంగవరం